# రాజీ


వాణిశ్రీ

గోవిందరావు మూడు కోట్లు ఖర్చుపెట్టి జూబ్లీ హిల్స్‌లో కట్టించిన మూడంతస్తుల మేడ గృహ ప్రవేశానికొచ్చిన చెల్లెలు అనసూయ అలిగి కూర్చుంది.

ఆ రోడ్డంతా గృహప్రవేశానికొచ్చిన అతిధుల కార్లతో నిండిపోయింది. గోవిందరావు, అతని భార్య రుక్మిణి అతిధులకు స్వాగతం చెప్తూ, షామియానాలలో లంచ్ చేస్తున్న వారిని పలకరిస్తూ హడావిడిగా తిరుగుతున్నారు.

అనసూయను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒక బెడ్‌రూమ్‌లో కూర్చుని టీ.వీ. చూస్తోంది.

“ఏవమ్మా! ఇంటి ఆడపడుచువి. పెత్తనమంతా నీదేగా! ఏమీ పట్టనట్లు కూర్చున్నావేమిటి?” అటుగా వచ్చిన మంధర ప్రశ్నించింది. ఆమె వరసకు మేనత్త అవుతుంది. ఆమె అసలు పేరేమిటోగానీ అంతా మంధర అని





పిలుస్తారు.

"ఇక్కడ నాకేం పెత్తనం వుందత్తా? ఇప్పుడు మేం వాళ్ల కళ్లకి కనిపిస్తామా? సిరి వచ్చిపడిం దిగా! నేనేమో పేదరాలిని. నన్నెవరు పట్టించు కుంటారు? కార్లలో వచ్చిన వారిని, ఖరీదైన గిఫ్టులు తెచ్చిన వారినీ కౌగలించుకుంటారు. మేమిప్పుడు పనికి వస్తామా?" అన్నది అన సూయ.

"అంతేలేమ్మా! కాలం కలిసొచ్చి నడిసొచ్చే కొడుకులు పుట్టినట్లు మీ అన్న రియల్ ఎస్టేట్‌లో కోట్లు గడించాడుగా! కోటీశ్వరుల జాబితాలోకి వెళ్లిపోయాడు. మనలాంటోళ్లంటే చిన్న చూపే మరి" అంటూ అనసూయను ఓదార్చింది.

ఆ తర్వాత రుక్మిణి కనిపిస్తే "ఏవమ్మా రుక్మిణీ! మీ ఆడపడుచు అలిగి కూర్చుంది చూసావా?" అడిగింది మంథర.

"ఏమిటి పిన్నీ! అనసూయ అలిగిందా? ఎందుకు? ఏం తక్కువ చేశాం? ఏభై వేలు పెట్టి నెక్లెస్ పెట్టామా? పదివేల రూపాయల పట్టుచీర కొనిచ్చాం. ఇంకేం లోటు చేశాం?" అన్నది రుక్మిణి.

"ఏమోనమ్మా!... నాకేం తెలుసు? శుభమా అని గృహప్రవేశం చేసుకుంటూంటే ఆడపడుచు

ఏడుస్తూ కూర్చోవడం మంచిదికాదు. ఏమిటో కనుక్కోండి" చిచ్చుపెట్టి వెళ్లిపోయింది మంథర.

"ఏవండీ! మీ చెల్లెలు ఎందుకో అలిగిందట. ఏమిటో కనుక్కోండి" అని గోవిందరావుని హెచ్చరించింది రుక్మిణి.

"ఏమిటో... దీనికెంత చేసినా తృప్తి వుండదు" అని గొణుక్కుంటూ చెల్లెల్ని వెతుక్కుంటూ వెళ్లాడు.

"అనసూయా! ఇక్కడేం చేస్తున్నావ్? బంధువులంతా నిన్ను అడుగుతూంటే?" అంటూ వచ్చాడు గోవిందరావు.

అన్నని చూసి కళ్లనీళ్లు తుడుచుకుంటూ, ముక్కు చీదుకుంది అనసూయ.

"శుభకార్యానికొచ్చి ఏడవడం ఏమిటి? నీకేం తక్కువైంది?" విసుగ్గా అన్నాడు.

"అన్నీ ఎక్కువే...!" అన్నది అనసూయ ఏడుపు ఆపుకుంటూ.

"ఏమిటో చెప్పరాదూ? లేకపోతే నాకేం తెలుస్తుంది?" అన్నాడు గోవిందరావు చిరాకు పడుతూ.

"శ్రీకాంత్‌ని అమెరికా పంపిస్తానన్నావు. ఏమైనా పట్టించుకున్నావా? ఔన్లే! మేమిప్పుడు నీకంటికి ఆనతామా? కోటేశ్వరుడివై పోయావుగా! నీ స్నేహాలన్నీ కోటీశ్వరుల్తోనే వుంటాయి. నూనె నూనెలో కలుస్తుందిగానీ నీళ్లల్లో కలుస్తుందా... నా పిచ్చిగాని."

"అబ్బబ్బ ఆపవే నీ సొద... నీ కొడుకుని అమెరికా పంపాలి. అంతేగా?"

"అంతేకాదు... నీ అల్లుడ్ని చేసుకోవాలి."

"మరి దాన్నేం చేస్తావు?"

"ఏదో చేసి వదిలించుకుంటాగా!"

"సరే! అదేదో చేసిరా! చూద్దాం" అని గోవిందరావు చెల్లెలికి అభయమిచ్చాడు.

అనసూయ ఎగిరి గంతేసింది.

* * *

శ్రీకాంత్‌కి బి.టెక్. పాసయ్యాక లెక్చరర్‌గా పనిచేస్తున్న రాజేశ్వరితో పెళ్లి జరిగింది. శ్రీకాంత్‌కి చాలాకాలం జాబ్ దొరకలేదు. సంపాదించే అమ్మాయి దొరికిందే చాలని కట్నకానుకల దగ్గర పేచీ పెట్టకుండా పెళ్లి చేసుకున్నారు.

తర్వాత పరిస్థితులు మారిపోయాయి. శ్రీకాంత్ కంప్యూటర్ కోర్సులు చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీరయ్యాడు. నెలకి ఏభైవేలు సంపాదిస్తున్నాడు. ఇప్పుడు రాజేశ్వరిది ముష్టిజీతం.

ఒకప్పుడు గోవిందరావు కూతురు నల్లటి తుమ్మమొద్దు. తారు డ్రమ్ము ఆకారం. అన్న కూతుర్ని ఎక్కడ చేసుకోమంటాడోనని అనసూయ తప్పుకు తిరిగేది. కొడుక్కి ఉద్యోగం రాకముందే తెలివిగా ఉద్యోగం చేస్తున్న అమ్మాయిని కోడలుగా చేసుకుంది. కానీ ఇప్పుడు రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో గోవిందరావు కోటీశ్వరుడయ్యాడు. అతని ఏకైక సంతానం ధనలక్ష్మి.

ధనలక్ష్మిని వదులుకోవడం ఎంత తెలివి తక్కువ పనో అనసూయకి అర్థమైంది. ఇప్పుడున్న కోడల్ని వదిలించుకుంటే తన కూతుర్ని చెల్లెలి చేతిలో పెట్టడానికి గోవిందరావుకీ ఇష్టమే. కూతురు అందగత్తెకాదు. ఎవడైనా డబ్బు కోసమే చేసుకుంటాడనే నగ్నసత్యం అతనికి తెలుసు. అదే మేనల్లుడే అల్లుడైతే తనమీద భయభక్తులతో వుంటాడు. కూతురికి హాని చేయడం, సరిగా చూసుకోకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నం కావు.

అనసూయ ధోరణి మారిపోయింది. కోడల్ని సతాయించడం మొదలు పెట్టింది. పిల్లిమీద,

ఎలుకమీదా పెట్టి తిడుతోంది. ప్రతి దానికీ దరిద్రపు సంబంధమని, శనిగ్రహంలా దాపురించిందనీ అనడం సాగించింది.

రాజేశ్వరి మొగుడి దగ్గర మొత్తుకుంది. జరగబోయే కథంతా తెలిసినవాడు గనుక సర్దుకుపొమ్మన్నాడు. సర్దుకోలేకపోతే తట్టాబుట్టా సర్దుకోమన్నాడు.

సహనానికైనా హద్దుంటుంది. హద్దులు దాటితే సహనం అసహనంగా మారుతుంది. రాజేశ్వరి ఇక భరించలేక వేరు కాపురం పెడదామని ప్రపోజ్ చేసింది. అందుకు శ్రీకాంత్ ఒప్పుకోలేదు. తల్లి ఒంటరిగా ఎలా వుంటుందన్నాడు. వృద్ధాశ్రమంలో వుంచడం తనకు ఇష్టం లేదన్నాడు.

ధనలక్ష్మి అప్పుడప్పుడూ ఇంటికి వస్తోంది.

'బావా! బావా! అని శ్రీకాంత్ వెంట తిరుగుతోంది.

శ్రీకాంత్ ఆమెతో సినిమాలకు, షికార్లకూ తిరగడం మొదలుపెట్టాడు. అనసూయ వాళ్లని ప్రోత్సహిస్తోంది. మేనకోడలికి రకరకాల వంటలు చేసిపెడుతోంది. బ్రతిమాలి తినిపిస్తోంది.

ఒక రోజు శ్రీకాంత్ అకారణంగా రాజేశ్వరి మీద చెయ్యి చేసుకున్నాడు.

రాజేశ్వరి అభిమానం దెబ్బతింది. ఆమెకు తనమీద ఏదో కుట్ర జరుగుతున్నదని అర్థమైంది. ఇక ఆ ఇంట్లో వుంటే తన ప్రాణానికి ఏని జరిగినా జరగొచ్చుని, వెళ్లిపోవడానికి నిర్ణయించుకుంది.

కొడుకు శరణ్‌ని తీసుకుని వెళ్తూంటే శ్రీకాంత్ అడ్డుపడ్డాడు. మనవడిని ప్రస్తుతానికి తల్లితోనే వుండనియ్యమని కొడుక్కి సలహా ఇచ్చింది రాజేశ్వరి. ఎందుకంటే వాడికిప్పుడు ఐదేళ్లు. స్కూల్లో ఫస్ట్‌క్లాస్ చదువుతున్నాడు. పసివయసు. వాడి ఆలనాపాలనా చూడడానికి చాలా సమయం కావాలి. ప్రస్తుతం రాజేశ్వరి దగ్గరే వుంటే ఆ తిప్పలేవో అదే పడుతుంది. విడాకులు తీసుకునేటప్పుడు వాడిని తమతో వుండేట్లు కోర్టులో కేసువేయవచ్చు.

తల్లి ఆలోచన శ్రీకాంత్‌కి నచ్చింది. కానీ అతనికి కొడుకంటే బాగా ఇష్టం. వాడిని వదిలి వుండడం కష్టం అనిపించింది. కానీ అనసూయ అనేక విధాల కొడుక్కి నచ్చజెప్పింది.

* * *

ఏ మనిషైనా మనకి అందుబాటులో వున్నప్పుడు వారి విలువ తెలియదు. దూరమైనప్పుడే తెలుస్తుంది. శ్రీకాంత్‌కి ఇప్పుడు అటువంటి అనుభవం ఎదురైంది. రాజేశ్వరి ఎంతో అనుకూలవతి. అందమైనది కూడా. కొడుకు శరణ్ కూడా అంతా తల్లి పోలికలతో ముద్దుగా వుంటాడు. అటువంటి కొడుకు దూరమైపోవడం శ్రీకాంత్‌కి కష్టంగా వుంది. దాదాపు ప్రతిరోజూ కొడుకు గుర్తుకొస్తున్నాడు. వాడి ఆటలు, పాటలు, చిలిపి చేష్టలు, ముద్దుముద్దు మాటలు జ్ఞాపకం వచ్చి అతనికి నిద్రపట్టడం లేదు. రాజేశ్వరితో పోల్చుకుంటే ధనలక్ష్మి కురూపి. కానీ ఆమెను చేసుకుంటే కుబేరుడవుతాడు. డబ్బు, దానివల్ల వచ్చే సౌకర్యాలు, సుఖాలూ సమకూరుతాయి. జూబ్లీహిల్స్‌లో పేలస్ లాంటి భవనంలో నివాసం వుంటాడు. కార్లలో తిరుగుతాడు. విమానాలలో ఎగురుతాడు. జీవితం అంటే అవేనా? అనే ఆలోచనలో పడ్డాడు.

ధనలక్ష్మితో పెళ్లికి రాజేశ్వరిని వదులుకోవడం ఇప్పుడు అతనికి అంత ఇష్టంగా లేదు. రాజేశ్వరిని విడాకులు ఇవ్వకుండా సర్దుకుపొమ్మని రాయబారం పంపాడు. కానీ అందుకు

రాజేశ్వరి ఒప్పుకోలేదు. ఏం చేయాలో తెలియక అయోమయంలో పడిపోయాడు శ్రీకాంత్.

కొడుకుని పక్కన పెట్టి అనసూయ లాయర్ని మాట్లాడి అన్ని వ్యవహారాలూ తనే చూడడం మొదలుపెట్టింది. ముందుగా రాజేశ్వరికి లాయర్ ద్వారా నోటీసు పంపించింది. భర్తను వదిలిపెట్టి వెళ్లావు. సంవత్సరం దాటింది. కాబట్టి విడాకులు కావాలి. అలాగే కొడుకుని అప్పగించాలి అని నోటీసు సారాంశం. అది చదవకుండానే శ్రీకాంత్ సంతకం పెట్టేశాడు.

పది రోజుల తర్వాత రాజేశ్వరి నుంచి జవాబు వచ్చింది. "నేను విడాకులు తీసుకోవడానికి సిద్ధంగా వున్నాను. కానీ శరణ్‌ని మీకు అప్పగించను. ఎందుకంటే వాడు నా కొడుకు. నా రక్తమాంసాలు పంచుకుని పుట్టినవాడు. వాడితో నీకు ఎటువంటి సంబంధం లేదు. వాడు నీకు పుట్టలేదు. కావాలంటే డి.యన్.ఏ. టెస్ట్‌లకు నేను సిద్ధం."

అది చదివిన అనసూయ నెత్తిన పిడుగు పడింది. ఆమెకు గతం గుర్తొచ్చింది. పెళ్లయి సంవత్సరమైనా రాజేశ్వరి కడుపు పండలేదు. టెస్ట్‌లో శ్రీకాంత్‌కే లోపం అని తేలింది. అనసూయ దిగులు పడింది. కొడుకు సున్నిత మనస్కుడు. తనలో లోపం వుందని తెలిస్తే దిగులు పడతాడు. వాడికి పసిపిల్లలంటే ఎంతో ఇష్టం. ఇరుగు పొరుగు పిల్లల్ని ఎత్తుకుని ఆడించేవాడు. ఇంట్లో ఒక్కడే కావడంతో పసిపిల్లలు లేకపోవడంతో ఎక్కడ పసిపిల్లల్ని చూసినా వాడికి ప్రాణం లేచివచ్చేది. అటువంటి వాడికి పిల్లలు పుట్టే యోగం లేదని తెలిస్తే తల్లడిల్లిపోడూ?

"అత్తయ్యా! శ్రీకాంత్‌కి ఈ విషయం చెప్పవద్దు. ఏదో చిన్న లోపం సర్దుకుంటుంది అని చెప్పండి. ఫెర్టిలిటీ సెంటర్‌లో కన్సల్ట్ చేద్దాం.

> **అప్పుడు ఆన్ చేస్తాను**
>
> వాతావరణం బాగా వేడిగా ఉంటే ఏం చేస్తావ్? స్నేహితుడిని ప్రశ్నించాడు రామం.
>
> ఏ.సి. దగ్గర కూర్చుంటాను.
>
> అయినా ఇంకా వేడిగానే అనిపిస్తే...
>
> ఏ.సి. ఆన్ చేస్తాను...

ఆ విధంగా పిల్లల్ని కంటాను. తన పిల్లలే అని శ్రీకాంత్ నమ్ముతాడు." అని రాజేశ్వరి ఉపాయం చెప్పింది.

"రాజీ! నువ్వు చెప్పినట్లే చేద్దాం. అనవసరంగా వాడికి మనస్తాపం కలిగించడం ఎందుకు?" అన్నది అనసూయ.

తర్వాత ఫెర్టిలిటీ సెంటర్లో డోనర్ ద్వారా రాజేశ్వరి గర్భం ధరించి శరణ్‌ని కన్నది. అప్పుడు ఆమె భర్తలా నటించడానికి బంధువుల అబ్బాయిని తీసుకొచ్చి నాటకం ఆడించింది అనసూయ.

అనసూయకి అదంతా గుర్తొచ్చింది. శ్రీకాంత్ అసలే సున్నిత మనస్కుడు. ఇప్పుడు రాజేశ్వరి లాయర్ నోటీసుకి ఇచ్చిన జవాబు శ్రీకాంత్‌కి తెలిస్తే? శరణ్ తన రక్తంపంచుకు పుట్టినవాడు కాదనే సత్యం జీర్ణించుకోగలడా? ఆమెకు ఎందుకో భయం కలిగింది. కుటుంబానికి కేవలం డబ్బు, మేడలే కాదు పరువు ప్రతిష్టలు కూడా ముఖ్యమే కదా? అనిపించింది. కోర్టులో కేసు నలుగుతూ వుంటే శరణ్, శ్రీకాంత్ కొడుకు కాదనే సత్యం లోకానికి వెల్లడవుతుంది. కోర్టు తీర్పు కూడా కోడలికి అనుకూలంగానే రావచ్చు. శ్రీకాంత్‌కి పిల్లలు పుట్టే అవకాశం లేదని తెలిస్తే మేనకోడలు ధనలక్ష్మి మాత్రం వాడిని ఎందుకు పెళ్లి చేసుకుంటుంది? అప్పుడు శ్రీకాంత్ రెంటికీ చెడ్డ రేవడి అవుతాడు.

ఇన్నాళ్లూ తను అన్నకు వచ్చిన నడమంత్రపు సిరి ఎలా సొంతం చేసుకోవాలా అని దుష్టపన్నాగం పన్నింది. తన కళ్లకు పొరలు కమ్మాయి. కొడుకు లోపం గుర్తుకురాలేదు. కోడలు చెప్పుతో కొట్టినట్లు జవాబిచ్చి తన కళ్లు తెరిపించింది.

అనసూయ ఇక ఆలస్యం చెయ్యలేదు. కోడలు పంపిన జవాబు చించిపారేసింది. తనే కోడల్ని వెతుక్కుంటూ వెళ్లింది. రాజేశ్వరి అత్తని చూసి ఆశ్చర్యపోయింది.

"రాజీ! నన్ను క్షమించు. చిన్నదానివైనా నీ కాళ్లు పట్టుకుంటాను. శరణ్ తన కొడుకు కాదనే నిజం శ్రీకాంత్‌కి తెలియగూడదు. తెలిస్తే వాడి గుండె పగులుతుంది." అని కన్నీళ్లు పెట్టుకుంది అనసూయ.

రాజేశ్వరి ఏమీ మాట్లాడలేదు.

"నేను మా అన్న ఆస్తి పరాయివాళ్లకి దక్కకుండా నాకే స్వంతం కావాలనే ఆలోచనతో నీకు అన్యాయం చేయాలనుకున్నాను. నన్ను ధనపిశాచం ఆవహించింది. జరిగింది మర్చిపో. మన ఇంటికి పోదాం పద" అన్నది అనసూయ.

శరణ్ నాయనమ్మని చుట్టుకుని వదలడం లేదు. వాళ్లద్దరి మధ్యా జరుగుతున్న ఘర్షణ ఏమిటో అర్థం చేసుకునే వయసుకాదు వాడిది. చాలా రోజుల తర్వాత నాయనమ్మ కనిపించడంతో వాడికి ఆనందంగా వుంది.

ఇన్నాళ్లూ తనను హింసపెట్టిన అత్త కాళ్లా వేళ్లా పడుతూ వుండడంతో ఆమెది ఏదైనా కొత్త నాటకమేమో అనే అనుమానం వచ్చింది రాజేశ్వరికి. కానీ ఆమె వలవలా ఏడవడం, శరణ్ లేకుండా శ్రీకాంత్ జీవించలేడని పదేపదే చెప్పడం వల్ల అత్త పశ్చాత్తాపపడుతున్నట్లుగా నమ్మ గలిగింది.

ధనలక్ష్మితో పెళ్లి బెడద వదిలిపోవడం ఆమెకు రిలీఫ్ కలిగించింది. కాళ్ల దగ్గరికి వచ్చిన అత్తని కాలదన్నడం ఎందుకు? తను రాజీ పడుతున్నట్లు చెప్తున్న మాటలు ఎంతవరకూ నిజమో తర్వాత కాలమే నిర్ణయిస్తుంది. శరణ్‌కి కూడా తండ్రిలేని లోటు తీరుతుంది. తనకీ ఒంటరి జీవితం నుంచి విముక్తి కలుగుతుంది.

అనేక విధాలుగా ఆలోచించిన రాజేశ్వరి అత్తవెంట బయల్దేరింది.

* * *

ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన శ్రీకాంత్‌ని "డాడీ...!" అంటూ పరిగెత్తుకొచ్చి కాళ్లకి చుట్టుకున్నాడు శరణ్.

చాలా కాలం తర్వాత కొడుకుని చూసిన శ్రీకాంత్ మనసు వుప్పొంగిపోయింది. శరణ్‌ని ఎత్తుకుని ముద్దులాడాడు.

"నిన్నెవరు తీసుకొచ్చారు?" కొడుకుని అడిగాడు.

"నేనే...!" అంటూ వచ్చింది అనసూయ.

తల్లి వైపు ఆశ్చర్యంగా చూసాడు. ఆమె వెనుకనే వచ్చిన రాజేశ్వరిని చూసి అతని కళ్లు మెరిశాయి.

"రాజీతో రాజీ పడిపోయానురా!" అన్నది అనసూయ.

శ్రీకాంత్ భార్యని, తల్లిని అయోమయంగా చూశాడు. ఇన్నాళ్లూ ఎలుక - పిల్లి, పాము - గద్దలా విరోధంగా వున్న అత్త - కోడలూ ఇంత సడెన్‌గా ఎందుకు రాజీ పడ్డారో అతనికి అర్థం కాలేదు. అసలు రహస్యం బైటపడే అవకాశం కూడా లేదు. ఇక ఆ విషయం శ్రీకాంత్ ఎన్నటికీ తెలుసుకోలేదు. ●